ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని మచిలీపట్నం సిఐటియు మండల అధ్యక్షులు బి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మచిలీపట్నం మండల పరిధిలో భోగిరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పని ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కూలీల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు రావడం లేదని కూలీలు తెలిపారన్నారు. కూలీలు పని చేస్తున్న ప్రాంతాలలో టెంట్లు ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. మండల సిఐటియు కార్యదర్శి సిహెచ్ జయరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు నిధులు పెంచాలని, 200 పని దినాలు కల్పించాలని ఆన్లైన్ మస్తరు విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలుచేసి పలుగు ,పారకు డబ్బులు ఇవ్వాలని కోరారు.

కవికాలమ్

ఉగాది వచ్చింది, గుమ్మం తడమని,
పసుపు కుంకుమలతో పరిమళం తాకని,
చిగురు తొడిగిన చెట్టు కొమ్మలు చూస్తే,
కొత్త ఆశలు కళ్ళలో కనపడని రోజు లేదు.
పచ్చడి కలిపినట్టు జీవితం కలుస్తుంది,
తీపి, చేదు, పులుపులన్నీ ఒకటే కడలి,
చెరుకు రసం చిలకరిస్తే, వేపపూత చేదును,
మామిడి కాయలు మునక్కాయలై మారని.

ఇంట్లో అమ్మ చేసే ఉగాది పిండివంటలు,
గారెలు, బొబ్బట్లు, పులిహోరులన్నీ గుండెకు
హాయి,
అయినా నాలుకకు కొత్త రుచుల కోసం,
పిజ్జా, బర్గర్‌లతో పోటీ పడుతున్నాం ఈ రోజు.
పంచాంగం చదివే పండితుడి గొంతు విన్నాం,
"శుభం కానీ, దోషం కానీ" అంటూ గుండె దడ,
కానీ రాశిఫలం కంటే ఫోన్‌లో నోటిఫికేషన్‌లు,
మన భవిష్యత్తును చెప్పేస్తున్నాయి ఇప్పుడు.

గతంలో ఉగాది అంటే గుడి మెట్లు ఎక్కడం,
మామిడాకుల తోరణంతో మనసు తడమడం,
ఇప్పుడు సెల్ఫీలు, రీల్స్‌తో సంబరం,
ట్రాఫిక్‌లో కూర్చుని టిక్‌టాక్‌లో ఉగాది శు
భాకాంక్షలు!
పాత చీరలు కొత్త బట్టలై మారాయి,
కానీ ఆ చీర కట్టుకున్న అమ్మమ్మ లేదు,
ఆమె చేతి గాజుల గలగలలు వినిపించవు,
ఇప్పుడు బ్లూటూత్ హెడ్‌ఫోన్స్‌తో సైలెన్స్
కొన్నాం.

పల్లెల్లో ఉగాది అంటే పశువులకు స్నానం,
గంగిరెద్దుల ఆటలు, కోడి పందాల సందడి,
ఇప్పుడు ఆ ఊరు ఖాళీ, యువత నగరంలో,
అపార్ట్‌మెంట్‌లో ఉగాది "వీడియో కాల్"
పండగైంది.
పొలంలో పంట కోసం చూసే రైతు కళ్ళు,
ఇప్పుడు షేర్ మార్కెట్ గ్రాఫ్‌లో పడ్డాయి,
వేపపూత రుచి గుర్తుంది కానీ,
వేప చెట్టు ఎక్కడుందో ఎవరికీ తెలీదు.

అయినా, ఉగాది అంటే ఒక కొత్త ఆరంభం,
పాత బాధలను పంచాంగంతో కాల్చడం,
కొత్త కలలను చిగురింపజేయడం,
పచ్చడిలా జీవితాన్ని స్వీకరించడం.
ఈ సంవత్సరం కొత్త ఆలోచనలు రావాలి,
పాత సంప్రదాయాలు కొత్త రూపం
తీసుకోవాలి,
మనిషి మనిషిగా బతకాలి, యంత్రం కాకూడదు,
ఉగాది మనకు ఆ సత్యం చెప్పాలి.


పిల్లలు చేతుల్లో బొమ్మలు పట్టుకుంటే,
ఆ బొమ్మలు గుండెల్లో ఆనందం నింపాలి,
పెద్దలు డబ్బు కోసం పరుగెడితే,
ఆ డబ్బు మనసుకు సమాధానం ఇవ్వాలి.
ఉగాది పచ్చడి కలిపే సమయంలో,
ఒక్క క్షణం ఆగి ఆలోచించాలి
ఈ తీపి, చేదు, పులుపు మన జీవన రాగం,
అన్నీ కలిస్తేనే జీవితం సంగీతం.

ఈ ఉగాది మనకు కొత్త దారి చూపాలి,
పాత గాయాలను మాన్పి, ఆశలు నింపాలి,
మనం మనుషులం, మనసున్న వాళ్ళం,
ఈ పండగ మనకు ఆ స్పృహ తెప్పించాలి.

- శివ సాయి కీర్తన









కోల్డ్ స్టోరేజీ బాధిత రైతులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 25న పట్టణంలో తొర్రగుంటపాలెం సమీపంలో గల సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజ్ జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన మిర్చి రైతులకు నష్టపరిహారం అందించాలని శనివారం కొండపల్లి ఖిల్లాలో జిల్లా రివ్యూ మీటింగ్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, స్థానిక ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు జగ్గయ్యపేట ప్రాంత మిర్చి బాధిత రైతులు వినతిపత్రం అందజేశారు. వైసిపి నాయకులు, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు కనగాల రమేష్, సొసైటీ మాజీ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.కె మహమ్మద్ హనీఫ్, అమ్మడాల హుస్సేన్, షేక్ అనీఫ్ తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నష్టపోయిన మిర్చి రైతులకు సరైన న్యాయం చేయాలని, అఖిలపక్ష కమిటీ వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

ఉగాది పురస్కారాల మహోత్సవం

ప్రజాశక్తి - కంచికచర్ల : స్థానిక కె.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ కాలేజీ, ఆవరణలో శనివారం కంచికచర్లలో ఉగాది పురస్కారాల మహోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. సభా నిర్వాహకులు తంగిరాల సోని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు కె.వి.కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగే కార్యక్రమంలో కంచికచర్ల లో ఇలా ఉగాది సభ జరపడం కళాకారులకు, కవులకు, ఇంకా ఇతర రంగంలో కృషి చేసినవారికి ఉగాది అవార్డులు ప్రకటించడం హర్షణీయమన్నారు. ముఖ్య అతిథి ప్రముఖ కవి బంగార్రాజ్ కంఠ మాట్లాడుతూ ఉగాది మనకు ముందే వచ్చింది కవులతో, కళాకారులతో, విద్యార్థులతో సభ చాలా నిండుగా ఉందని ఇలా ప్రతిచోటా ఉగాది సందర్భంగా కవులు, కళాకారుల కలవటం వారిని సన్మానించడం చాలా మంచిదని తెలిపారు. కవి గడ్డం విజయరావు మాట్లాడుతూ తొలి తెలుగు పండుగ ఉగాది మనందరి ఇళ్ళ పండుగని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, సమాజంలో వున్న రుగ్మతలను పారద్రోలి ఈ ఉగాది మంచి జరగాలని కోరారు. కె.వి.కృష్ణారావు మాట్లాడుతూ మా కాలేజీలో ఈ ఉగాది సభ జరగడం చాలా ఆనందంగా ఉందని, విద్యార్థుల్లో చైతన్యం నింపడం కోసం ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సభలో కవుల కవి సమ్మేళనంలో కవులు శిఖాఆకాష్, అజయ్ మేడిపల్లి, గడ్డం విజయరావు, ఇస్మాయిల్ ,తంగిరాల సోని ఉగాది కవిత్వం వినిపించారు. వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ఉగాది పురస్కారం,సన్మానం చేశారు. .ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ , కవులు, కళాకారుల, పాత్రికేయులు ,వేద పాఠశాల విద్యార్థులు, కె.వి .మెడికల్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మైలవరం : ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి జారి కింద పడి ఒకరు మృతి చెందిన సంఘటన మైలవరం మండలంలోని చంద్రాల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చంద్రాల గ్రామానికి చెందిన లంక వెంకటేష్ (26)ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. కొబ్బరికాయలు కోసి చిరు వ్యాపారులకు అమ్ముతుంటాడు. ప్రతిరోజులాగానే శనివారం గ్రామంలోని కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్ర గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుని భార్య లంక లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలల రక్షణ కమిటీలకు అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల స్థాయి బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సి ఎం పిఒ, గ్రామ స్థాయి బాలల రక్షణ కమిటీలు సామర్థ్యం పటిష్టం చేయుట అవగాహన కార్యక్రమం జరిగింది. ఎన్టిఆర్ జిల్లా డిసిపి కార్యాలయము నుండి బాలల సంరక్షణ అధికారి దుర్గా ప్రసాద్ బాలల హక్కులు, మిషన్ వాత్సల్య పథకం గురించి అవగాహన కల్పించారు. సిడిపిఓ పుష్పలత, ఎంపిపి జ్యోత్స్న , మండల పరిషత్ అధికారిణి సునీత శర్మ మాట్లాడారు. మండల స్థాయి ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల జోలికొస్తే ఖబడ్దార్

ధర్నాలో నేతల హెచ్చరిక

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరంలో 15, వేల మంది 40, సంవత్సరాలకు పైగా తట్టా, బుట్ట, బల్లలపై చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న హాకర్లపై అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు వేధింపులు ఆపాలని విజయవాడ హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో చిరు వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొని మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే చిరువ్యాపారస్తులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చిరు వ్యాపారస్తులపై అనేక దౌర్జన్యాలు చేస్తూ బెదిరిస్తున్నారని అన్నారు. టిడిపి నాయకులు రోడ్లపై జీవనం కొనసాగిస్తున్న హాకర్స్ పొట్టలు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ నగరంలో ఎటువంటి ట్రాఫిక్‌కు ప్రజలకు అంతరాయం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో వ్యాపారాలు చేసుకుంటున్న వారిని తొలగించటం సరైంది కాదన్నారు. సిఐటియు జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కార్పొరేటర్లు తమ సొంత ప్రయోజనాల కోసం రోడ్లపై జీవనం కొనసాగిస్తున్న హాకర్లపొట్ట కొట్టొద్దని అన్నారు. 2014 స్ట్రీట్ వెండర్స్ యాక్టులో భాగంగా చిరు



ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులతో బాబూరావు

వ్యాపారాలు చేసుకుంటున్న వారికి రక్షణ కల్పించి మౌలిక సదుపాయాలు కల్పించాలని నిబంధనలు ఉన్నా అవేవీ పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులు లంచాలకు కక్కుర్తి పడి వారిదళారులను తెచ్చి బలవంతంగా వ్యాపారాలు చేయిస్తున్నారు. ఈ ధర్నాలో 50, డివిజన్ సిపిఎం కార్పొరేటర్ బి.సత్యబాబు మాట్లాడుతూ హాకర్స్‌కు రక్షణ కల్పించాలని, బీసెంట్ రోడ్‌లో కొత్తగా వచ్చిన సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, సెంట్రల్ సిటీ నాయకులు వై.సుబ్బారావు,ఎం. సీతారాములు, ఇ.వి నారాయణ,టి.కృష్ణ,చంద్రశేఖర్, హాకర్స్ యూనియన్ నాయకులు బి.లక్ష్మణ, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకటేశ్వరావు, సి.హెచ్ మురళి, హాకర్స్ నాయకులు బి.శ్రీనివాసరావు, పి సాంబిరెడ్డి, గోపి,లక్ష్మి, మస్తాన్ ,రాణి, అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించకుంటే మరో బషీర్‌బాగ్ ఉద్యమం

ధర్నాలో సిపిఎం నాయకులు కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాణిగారితోట విద్యుత్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ విద్యుత్ భారాలను నిలువరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలోనే ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమీషన్(ఈఆర్‌సి) పేరుతో సుమారు రూ. 15.50వేల కోట్లు విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపుతుందన్నారు. సిపిఎం ఇంటింటికి తిరిగి బిల్లులు పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతి బిల్ యూనిట్‌లు గత నెల మీద వాడకం తగ్గినా బిల్లులో చార్జీలు మాత్రం 450నుండి 600 శాతం వరకు పెరిగాయన్నారు. ఆరు రకాల అదనపు భారాలను ప్రజల వద్ద నుండి వసూళ్ళు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఏం చెప్పి నమ్మించారో గుర్తుందా? ఎన్నికల సభల్లో ఎట్టిపరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీలు ఇచ్చి ప్రజల నెత్తిన వేల కోట్లు రూపాయల భారాలను వేయడం దుర్మార్గం అన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టాలని



ధర్నా చేస్తున్న నగర వాసులు, సిపిఎం నాయకులు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేపదే చెప్పిన కూటమిలోని సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి లోకేష్ ఈ రోజు అదే స్మార్ట్ మీటర్లు ప్రజలకు అంటకట్టడం ఎమిటని ప్రశ్నించారు. షిర్డి సాయి ఎలక్ట్రికల్స్ కాంట్రాక్ట్ నేడు కూడా ఎందుకు ఉందో ప్రజలకు టిడిపి, కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే పెంచిన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ప్రజా పోరాటాలు ఉధతం చేస్తాం హెచ్చరించారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు టి.చంద్ర శేఖర్, బి.చిన్నారావు, కోరాడ రమణ, నగర నాయకులు డి.వరప్రసాద్,గురుమూర్తి, రవీంద్ర, ఎన్.నాగేశ్వరరావు, వై కృష్ణ, పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కంచికచర్ల : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కంచికచర్ల ఎస్ఐ రాజు అన్నారు. శు క్రవారం కంచికచర్ల పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బోనగిరి రాజు మాట్లాడుతూ క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన టి.వరుణ్ సాత్విక్, ఎన్.రాజేష్ అండర్ 19 ఆల్ ఇండియా స్థాయి కుచ్‌బెహార్ ట్రోఫీలో ఆంధ్ర రాష్ట్ర జట్టు నుండి ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆరుగురు క్రీడాకారులను నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఎ)కి ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఇద్దరు క్రీడాకారులు జగ్గయ్యపేట పట్టణానికి చెందిన వరుణ్ సాత్విక్ బ్యాటర్‌గా 6 మ్యాచులలో 470 అత్యధిక పరుగులు చేశారు. రాజేష్ స్పిన్ బౌలర్‌గా 6 మ్యాచ్లలో అత్యధిక వికెట్లు 34 తీసి ఎన్‌సిఎకి సెలెక్ట్ అయ్యాడు. ఈ సందర్భంగా శనివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ని మర్యాదపూర్వకంగా కలిశారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అమరవీరుల ఆశయ సాధనకు కృషి :సిపిఎం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అమరవీరుల ఆశయ సాధన కోసం సిపిఎం పార్టీ కార్యకర్తలు ఎనలేని కృషి చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, కాకనబోయిన లింగారావు అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో శుక్రవారం రాత్రి కామ్రేడ్ గొట్టిముక్కల సైదారెడ్డి 13వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జెండాను సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు ఆవిష్కరించారు. గొట్టిముక్కల సైదారెడ్డి, మోరే బుజ్జి బాబయ్య, మోరే బక్కమ్మ ల స్థూపాలకు కోట కృష్ణ, పుట్టం పుల్లారావు, కాకనబోయిన సుబ్బారావు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.నాయకులు, మండల, పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి, నాయకులు రావెళ్ల శేషు, బాలు, కె.వెంకటేశ్వరరావు, షేక్ గౌసేమియా,పాల్గొన్నారు.



పేదలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎన్టీఆర్ జిల్లా టిడిపి పార్టీ ఉపాధ్యక్షులు గొర్రె శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో పేద మహిళలకు స్టీల్ ప్లేట్లు,పండ్లు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంఎల్ఎ బోండా ఉమా మహేశ్వరరావు పేదలకు పంపిణీ చేశారు.. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో గాడితప్పిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతుందని అన్నారు. సీతారాంపురంలో విక్రాంత్ పబ్లిషర్స్ వద్ద నిర్వహించిన టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో టిడిపి కార్పొరేటర్ మేడిబండ్ల బాలస్వామి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు స్టీల్ ప్లేట్లు పండ్లు పంపిణీ చేశారు.

ఫెన్సింగ్ క్రీడలో ఎంఎల్ఏ కుమారుడి ప్రతిభ

ప్రజాశక్తి - నందిగామ : ఒరిస్సా రాష్ట్రం కటక్ లో జరుగుతున్న 26వ జాతీయ సబ్ జూనియర్ అండర్ 14 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలకు నందిగామ నియోజకవర్గం నుంచి క్రీడాకారులు సుహాస్, ప్రత్యూష, శేష ఎంపికయ్యారు. ఈ పోటీలలో వ్యక్తిగత విభాగంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కుమారుడు ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. వీరికి అంతర్జాతీయ క్రీడాకారుడు గోనెలమూడి విజయ్ కుమార్ శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారు.

పోలీస్ కస్టడీకి ఇద్దరు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు లో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా ఈనెల 18న జరిగిన ఘర్షణ కేసులో ఇద్దరిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కోర్టు రిమాండ్‌కు పంపారు. మచిలీపట్నం జైల్లో ఉన్న వైసిపి కార్యకర్తలు ఈటూరి వెంకటేశ్వర రావు తూము శుక్రవారం కోర్టు అనుమతితో రెండు రోజులు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. మచిలీపట్నం నుంచి వారిద్దరిని పెనుగంచి ప్రోలు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

కెబిఎన్‌లో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అచ్చ తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించే వస్త్రధారణ, కవితా గానాలు, ఉగాది గీతాలాపనలతో నగరంలోని కెబిఎన్ కళాశాలలో ఉగాది వేడుకలు సందడిగా సాగాయి. కెబిఎన్ కళాశాల యుజిసి ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. తెలుగు ప్రాంతాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుపుకునే ఉగాది వేడుకలను ఆ ప్రాంత వస్త్రధారణతో విద్యార్థులు ఆకట్టుకునేలా ప్రదర్శించారు. అనంతరం కళాశాల సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణ రావు మాట్లాడారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉమెన్ స్టడీస్ సెంటర్ సమన్వయకర్త వి.శ్రీదేవి, వనమాదేవి, స్వాతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



దిశా నిర్దేశం ఏదీ?

"అమృత్ పేరుతో మూడు సంవత్సరాల నుంచి మంచినీటి కనెక్షన్లు ఇవ్వడం లేదు...నీటి కోసం డివిజన్ ప్రజలు అల్లాడుతున్నారు..ఆఖరికి వారు మా మెడ తిప్పుతున్నారు...ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే నేనే స్వయంగా వివింసి కార్యాలయం వద్ద ధర్నా చేయాల్సి ఉంటుంది" ఓ సభ్యుడు తీవ్ర ఆగ్రహం. "డ్రైన్ల పారుదల లేదు...శానిటేషన్ అధ్వానంగా ఉండి...దోమలు విజృంభిస్తున్నాయి...దోమల మందుకొడితే నివారణ కావడం లేదు.. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు...డివిజన్‌లో సమాధానం చెప్పలేకపోతున్నాం" అని మరో సభ్యుడి ఆవేదన. బాగున్న రోడ్లను చూపించి, ఇలానే నగరం అంతా ఉందని అవార్డులు పొందడం కాదు...వీధుల్లోకి వచ్చి మేము చూపించిన బజారులు చూపించండి మురుగుతాండవిస్తూ నగరానికి ఒక్క అవార్డు కూడా రాదు...మరో సభ్యుడు వ్యాఖ్యలు. ఇలా సాగింది ఇటీవల జరిగిన విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం. పార్టీలకతీతంగా కార్పొరేటర్లు అనేక సమస్యలను ఏకరవు పెడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. కానీ విధులు-నిధులు అంశంలో కూటమి ప్రభుత్వంతో మాట్లాడాలనే ఆలోచన కార్పొరేటర్లలో మచ్చుకైనా కనిపించ లేదు. కానీ నగరంలో పేరుకుపోయిన సమస్యలు, ప్రజల నిలదీత వంటి అంశాలకే కార్పొరేటర్లు పరిమితం అవుతున్నారు. మరొకవైపున విజయవాడ ఎంపి, కూటమి ఎమ్మెల్యేలు వివింసిని పూర్తిగా విస్మరించారు. వారి సొంత అజెండాను పూర్తి చేయించుకునేందుకు వివింసిని ఒక తురుపుముక్కగా



వాడుకుంటున్నారే తప్ప.. నగరపాలక సంస్థ బాగోగులు, దాని ఆర్థిక పరిస్థితులు నగరానికి చెందిన ప్రజాప్రతినిధులకు అవసరం లేదనే పరిస్థితి ఈ తొమ్మిది మాసాల వారి ఆలోచన విధానం తేటతెల్లం అవుతుంది. మరోవైపు వివింసి ఖజానాకు గండిపడే వ్యవహారాలకు ప్రజాప్రతినిధులు చర్యలు ఉంటున్నాయనే చర్చ అటు అధికార, ఇటు ప్రధాన ప్రతిపక్ష కార్పొరేటర్లలో లేకపోలేదు. లోపించిన సమన్వయం, అగమ్యగోచరం...ఖాళీ ఖజానా, అధికారుల కొరత, అవినీతిమయం, వెక్కిరిస్తున్న శిలాఫలకాలు... అత్యంత దైనీయ పరిస్థితిలో నగరపాలక సంస్థ అంతా అస్తవ్యస్తంగా తయారైందనే చర్చ సాగుతోంది. స్ట్రీట్ వెండర్స్ కమిటీ ఏర్పాటు దగ్గర నుంచి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం శాఫ్‌కు అప్పగించే అంశం, కాంట్రాక్టర్లకు అదనపు బిల్లులు చెల్లింపు అంశాల వరకు ఇలా పలు అంశాలపై పాలకపక్షం, ప్రతిపక్ష కార్పొరేటర్లకు సరైన అవగాహన, ఆలోచన లేక వేదిక సాక్షిగా ఒక నిర్ణయానికి రాలేకపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరు కావాల్సిన వందల కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు కానీ, స్పెషల్ గ్రాంట్లు, రూ.289 కోట్ల స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ స్కీమ్ నిధులు, టిడ్కో లబ్దిదారులకు చెల్లించాల్సిన బకాయి డబ్బులు, మొత్తంగా వెయ్యి కోట్లకు పైగా నిధులు, గ్రాంట్లకు సంబంధించిన అంశాల్లో అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి కార్పొరేటర్లు కూటమి ప్రభుత్వంతో మాట్లాడి నిధులను తెప్పించాలనే దిశగా చర్చ మచ్చుకైనా జరగలేదు. స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకొని సీనియర్ కార్పొరేటర్లు ఒక బృందంగా ప్రభుత్వం వద్దకు వెళ్లి నిధుల అంశాన్ని అడిగి ఎంతోకొంత మంజూరు చేయించే దిశగా ప్రయత్నం చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ చేసిన ప్రతిపాదన పట్ల ఏ ఒక్క కార్పొరేటర్ నుంచి సానుకూల సంకేతాలు రాకపోవడం గమనార్హం.

- వి.హెచ్.రాజు

ఉగాది కవి సమ్మేళనం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో శనివారం ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవి దాకరపు బాబురావు, ప్రముఖ వ్యాస రచ యిత మందడపు రాం ప్రదీప్ లకు ఉగాది ప్రతి భా సేవా జాతీయ పురస్కారాలను రచయితల సంఘం నేతలు అందజేసి శాలువాలతో సత్క రించారు. విశ్వావసు ఉగాది నామ సంవత్సరం అందరి జీవితాలలో నూతనోత్తేజం తేవాలని, ప్రపంచం అంతా శాంతి సుభిక్షాలతో విలసిల్లా లని షడ్రుచుల సమ్మేళనంలో కష్టసుఖాలు మాన వ సహజమని పలువురు కవులు ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో తిరువూరు రచయితలు సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్, తెలుగు వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమా మహేశ్వరరావు, పసుపులేటి వెంకయ్య, చినబా బు, ఉయ్యూరు అనసూయ, గ్రంథాలయాధికా రిణి కె. పద్మావతి, కొమ్మరాజు హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- నందిగామ : విద్యార్థులకు చట్టాలపై అవగాహన వుండాలని నందిగామ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. నందిగామ యమ్.ఆర్.ఆర్. కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ కోర్టు జడ్జి యస్.కె. రియాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కువగా జరుగుతున్న మోటార్ వాహనాలు, ర్యాగింగ్, ఆన్లైన్ సైబర్ మోసాలు, మహిళల పై వేధింపులు, డ్రగ్స్ , నార్కోటిక్స్ చట్టాలు వాటికి సంబంధించిన సెక్షన్లు తదితర విషయాలపై యువతకు అవగాహన కల్పించారు. అధ్యాపక బందంతో కలిసి ఛైర్మన్ భానుచందర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్‌కె.రియాజ్ వారిని సన్మానించారు.

లీలావతిలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లీలావతి గిరిజన పాఠశాలలో శనివారం విశ్వావసు నూతన తెలుగు సంవత్సరాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉగాది ప్రతి యుగానికి ఆది అని ఏ మంచి కార్యక్రమమైనా ఉగాది రోజున ప్రారంభిస్తారని అన్నారు. తెలుగు సంప్రదాయాన్ని ఉట్టిపడేలా వివిధ వేషధారణలో విద్యార్థులు అలరిం చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాధా కుమారి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకకాల ఎన్నికలు దేశ ప్రగతికి మూలం

మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : దేశంలో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే ఆర్థిక పురోభివద్ధితో పాటు దేశ ప్రగతి సాధిస్తామని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. శనివారం విజయవాడలోని వెన్యూ కన్వెన్షన్‌లో ' ఒకే దేశం - ఒకే ఎన్నిక ' అంశంపై విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి బి శివ శంకర్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా వెంకయ్య నాయుడు హాజరైన సందర్భంగా ఉగాది పర్వదినం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఒకే దేశం ఒకే ఎన్నికపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలని ఆయన అన్నారు. పదవి విరమణ చేశా కానీ ప్రజా జీవితంలో పెదవి విరమణ చేయలేదని అన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు నాకు నచ్చిన అభిప్రాయాలని యువతరానికి తెలియచేస్తానన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికలు దేశానికి కొత్త కాదని, సమర్థవంతంగా జరగాలని, కొందరు ఎందుకు వ్యతిరేకిస్తారో వారే సమాధానం చెప్పాలన్నారు. ఇది మోదీ నిర్ణయం కాదని, ఒకేసారి ఎన్నిక జరిగితే కేంద్రానికి లాభమని, రాష్ట్రానికి నష్టం అనే వాదన పసలేదన్నారు. . ప్రభుత్వాలు ప్రజలకు చదువు, వైద్యానికి, ప్రాధాన్యతనిస్తూ.. ప్రోత్సహించాలని, ఇంకా వేటికి ఉచితాలు వద్దని తెలిపారు. బి.శివ శంకర్ మాట్లాడుతూ చేస్తూ దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగితే రూ.50వేల కోట్ల వ్యత్యాసం



మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమ సద్వినియోగ పడుతుందని, రాజకీయ నాయకులు ప్రజల అకాంక్షకు దోహదపడెలా బాధ్యతను గుర్తెరగాలన్నారు. 1984 బిజెపి ప్రభుత్వంలో వెంకయ్య నాయుడు ఒకే ఎన్నిక ఒకే దేశం ప్రతిపాదన ముందుకు తెచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి వై సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పివి పార్థసారథి, ఒకే దేశం ఒకే ఎన్నిక కన్వీనర్ ఏటుకూరి సూర్యనారాయణ రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, విట్ కాలేజీ వైస్ ఛాన్సలర్ కోటారెడ్డి, మిర్చి అసోసియేషన్ నేత వెలగపూడి సాంబశివరావు, కాన్ఫిడేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్ప్రైజెస్ అధ్యక్షులు రాధిక, సాదినేని యామిని శర్మ, మేధావులు, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నగరాల సంఘం నూతన కమిటీ

ప్రజాశక్తి - వన్ టౌన్ : శ్రీ నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎన్విరావ్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ఎన్విరావ్ నూతన అధ్యక్షులుగా నల్లనీ సూర్యారావు, వర్కింగ్ ప్రెసిడెంట్గా భాయన శేఖర్ బాబు, ఉపాధ్యక్షులుగా పిల్ల రవి, మరుపిల్ల రాజేష్, పోతిన శ్రీనివాసరావు, విశాఖపట్నం తమ్మిన విజయ్ కుమార్ విశాఖపట్నం ప్రధాన కార్యదర్శిగా వెంకట్రావు ఆర్గనైజింగ్ సెక్రటరీగా మజ్జి శ్రీనివాసరావు కార్యదర్శిగా కోరగంజి భాస్కరరావు ఎన్ ఎస్ ఆర్ నాగోతి శ్రీనివాసరావు, పవన్ జోగేష్ , కోశాధికారిగా అడ్డు రాము ఇంకా కార్యవర్గ



సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా లింగపల్లి అప్పారావు, పిల్లా శ్రీనివాసరావు, రమేష్ తదితరులను ఎన్నుకున్నారు.

ఆసుపత్రికి బెడ్ షీట్లు, ఆక్సిమీటర్లు వితరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ఐవీఎం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో రూ 30 వేల వ్యయంతో ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లకు ఉపయోగపడే విధంగా నాణ్యమైన బెడ్ షీట్స్, సిబ్బంది రోగులను చెక్ చేసేందుకు వినియోగించే నిమిత్తం పల్స్ ఆక్సి మీటర్లను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా అంద శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవిఎం ట్రస్ట్ సభ్యులు రాజేష్, వేములపల్లి స్వీతిన్‌రాస్, పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - విజయవాడ : పోలీస్ కమిషనరేట్ నందు పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి మరియు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ పురస్కరించుకుని శనివారం ఏ-కన్వెక్షన్ సెంటర్‌లో సిపి ఎస్.వి రాజశేఖర్ బాబు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ రంజాన్ పండుగకు ప్రధాన కారణం ముస్లింల పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ ఈ నెలలోనే ఆవిర్భవించిందన్నారు. ముస్లిం సోదరులు అందరూ సమాజాభివద్ధి,శాంతి లో కీలకపాత్ర పోషిస్తూ రంజాన్ సందర్భంగా అందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు కె.జి.వి.సరిత, ఉదయరాణి, శ్రీకృష్ణమూర్తి నాయుడు, ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ లక్ష్మీశ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - విజయవాడ : విశ్వాసమే బలంగా విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, పేదరిక నిర్మూలనకు ఈ ఉగాది నాంది కోరుతూ జిల్లా ప్రజలకు ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ విశ్వావసు నామ సంవత్సర శు భాకాంక్షలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పేదరిక నిర్మూలన కోసం అమలు చేస్తున్న పి-4 పథకం దిగ్విజయంగా కొనసాగేందుకు ఈ ఉగాది నాంది కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. తెలుగువారి తొలి పండుగ ఉగాది సందర్భంగా జిల్లాలో రైతాంగం, వ్యాపార వర్గాలు, విద్య, వైద్య రంగాలు అభివద్ధి పథంలో పయనించాలన్నారు.

ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి గుడ్లవల్లేరు : స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా పనిచేస్తున్న సిహెచ్ సారధి బాబు కు ఎస్సైగా ప్రమోషన్ వచ్చినట్లు ఎస్సై ఎన్ వి.వి సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా సారధిబాబు ఏఎస్ఐగా గుడ్లవల్లేరులో విధులు నిర్వహించి ప్రజల నుండి, ఉన్నతాధికారుల నుండి మన్ననాలు పొందాలని అన్నారు. ఎస్సైగా పదోన్నతి పొంది బదిలీపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బదిలీపై వెళుతున్న సారధి బాబుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పన్నులు కట్టించుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నగరపంచాయతీ పరిధిలో ఆస్థి, ఖాళీస్థలాలు, నీటి పన్ను కట్టించుకునేం దుకు ఆది, సోమవారాలు (రెండురోజులపాటు) కార్యాలయంలో రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసినట్టు నగరపంచాయతీ కమిషనర్ పి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటలవరకు కౌంటర్లు పనిచేస్తాయని పట్టణ ప్ర జలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని పన్నుబకాయిలు చెల్లించాలని కోరారు.

పలుచోట్ల టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) తెలుగుదేశం పార్టీ 42 సంవత్సరాలు పూర్తిచేసుకుని 43వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం ఎంతో సంతోషదాయకం అని మంత్రి కొల్లు రవీంద్ర సతి మణి కొల్లు ఫౌండేషన్ ఛైర్మన్ కొల్లు నీలిమ అన్నారు. టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఇటీవల కాలంలో మతి చెందిన 150 మంది టిడిపి కుటుంబ సభ్యులకు కొల్లు ఫౌండేషన్ చొప్పున ఒక్కొక్కరికి రూ 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. టీడీపీ సీనియర్ నేతలు కొనకళ్ళ జగన్నాథరావు , గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ ఛైర్మన్ మాజీ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం : తెలుగుదేశం తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని 44 డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి దుర్గారావు అన్నారు. శనివారం 44వ డివిజన్లోని చెరువు సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్లో తెలుగుదేశం 44 డివిజన్ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి దుర్గారావు మాట్లాడారు.



కొల్లూరికి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గత ఐదు దశాబ్దాల పైగా సాహిత్య సాంస్కృతిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కవి, రచయిత, సంపాదకులు, స్వచ్ఛంద సేవకులు కొల్లూరికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది విశిష్ట పురస్కారం ప్రకటించడం అభినందనీయం అని ఎక్స్ రేలి సాహిత్య సాంస్కతిక సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయ రాజు, కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా 30వ తేదీన ఉదయం 9 గంటలకు తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే విశ్వావసు ఉగాది వేడుకల్లో పురస్కారం స్వీకరించవలసినదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత అండ్ సంస్కృతి సమితి నుండి ఆహ్వానం అందినట్లు తెలిపారు.


ప్రదర్శనలో పాల్గొన్న పాస్టర్లు, ప్రజలు

పాస్టర్లు, ప్రజాసంఘాల కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - విస్సన్నపేట : దైవజనులు ప్రవీణ్ పగడాల మరణం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్రైస్తవులకే కాదు అందరిదీ అని బాధాకరమైన సంగతి అని పాస్టర్లు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నాలుగు రోజులుగా ఆయన మృతిపై ఒక నిర్ణయాన్ని తెలవకపోవడంతో అనేక అనుమానాలు వస్తున్నాయని సమగ్ర దర్యాప్తు చేసి ఎవరైనా తెలపాలని అధికారులను కోరుతూ ఆయన మరణానికి చింతిస్తూ విస్సన్నపేట మండలం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో శనివారం మండలంలోని పాస్టర్స్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్స్ మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ కోడలు నుండి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ దళిత సంఘాలు సిపిఎం మండల కమిటీ కెవిపిఎస్ నాయకులు తదితరులు పాల్గొని మాట్లాడారు.









